ప్రజాశక్తి

మంగళవారం 17 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

జిల్లా అభివృద్ధి

ప్రణాళిక విడుదల చేయాలి

- 21, 22న నర్సీపట్నంలో సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ
- తొలి రోజు ర్యాలీ, బహిరంగ సభ
- ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపకల్పన
- మీడియా సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం, తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ - 2047లో పారిశ్రామికవేత్తల ప్రయోజనాలు తప్ప ప్రజల అభివృద్ధి కనిపించలేదని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం వ్యాఖ్యానించారు. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని విమర్శించారు. ప్రజల భాగస్వామ్యంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధి ప్రణాళికను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీల్లో నర్సీపట్నంలో జరగనున్న సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభలో జిల్లాలోని వివిధ మౌలిక సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ మహాసభ సందర్భంగా 21న నర్సీపట్నంలో భారీ ర్యాలీ, అబిద్ సెంటర్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. అందుకు సంబంధించి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు పెద్ద ఎత్తున మిగతా 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజల సంతృప్తే కొలమానం

- ఆ దిశగా అధికారులు పనిచేయాలి
- విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల సంతృప్తే కొలమానంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర - 2047 విజన్ ప్లాన్ ప్రాతిపదికగా ముందుకు సాగాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం రూపురేఖలు మార్చేలా ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా పని చేయాలని, అంకిత భావం ప్రదర్శించాలని సూచించారు. విశాఖ వేదికగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో మహా నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపట్టాలని, ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ నెల 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగిన రెండో విడత కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను, వివిధ అంశాలను జిల్లా అధికారులకు సోమవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో ఆయన వివరించారు. రంగాల వారీగా వివిధ అంశాలపై పవర్ మిగతా 2లో..

విద్యుత్ బిల్లులు దగ్ధం

వార్త 4లో..

అన్నదాతల్లో అల్పపీడనం గుబులు

వార్త 7లో..

బకాయి జీతాలు చెల్లించాలని శానిటేషన్ వర్కర్ల ధర్నాలు

వార్త 5లో..

నేడు రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ రాక

ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జెసిలతో ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగే ప్రాంతీయ సదస్సులో పాల్గొంటారు. రెవెన్యూ సదస్సులు, ఇతర అంశాలపై రోజంతా సమీక్ష చేస్తారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. పిజిఆర్ఎస్, ఫ్రీ హోల్డ్, నీటి పన్ను, ప్రభుత్వ భూముల సంరక్షణ, గృహ నిర్మాణ స్థలాలు, రీసర్వే, గ్రామ సభలో ప్రస్తావనకు వచ్చిన రెవెన్యూ అంశాలు, సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా ఆయన సమీక్షిస్తారు. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రజల నుంచి వినతులు కూడా స్వీకరించనున్నారు. ఈ మేరకు పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ వివరాలను వెల్లడిస్తూ రాష్ట్ర భూ పరిపాలనా విభాగం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

విశాఖ పోర్టు వేదికగా..

రేషన్ బియ్యం తరలింపు : ధర్మశ్రీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టు వేదికగా రేషన్ బియ్యం అక్రమ తరలింపులో కూటమి నాయకుల హస్తం ఉందని వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆరోపించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తనిఖీ చేసి పక్కనే ఉన్న రెండు వేర్‌హౌజ్‌లను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. అధికార పార్టీ ముఖ్యనేత బంధువుది కావడం వల్లే వాటిలో తనిఖీలు చేయలేదా ? అని నిలదీశారు. వెంటనే ఆ వేర్‌హౌజ్‌ల వివరాలు వెల్లడించాలని మిగతా 2లో..

ఆ స్థలంలో పరిశ్రమ వస్తేనే ఉపాధి

- ఎల్‌జి పాలిమర్స్ కాంట్రాక్టు కార్మికుల గోడును ప్రభుత్వం వింటుందా ?
- 260 ఎకరాలు రియల్ ఎస్టేట్ పరం కాకుండా చర్యలు తీసుకుంటుందా ?



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎప్పుడో వస్తాయో లేదో.. ఉపాధి చూపుతాయో లేదో తెలియని వాటికోసం సదస్సులు పెట్టి పారిశ్రామిక ఒప్పందాల పేర ఎప్పటికప్పుడు హడావుడి చేసే కంటే ఇదివరకే పారిశ్రామిక స్థలాల్లో ఉన్న వాటిని ప్రజలకు, కార్మికులకు ఉపాధి కల్పించేవాటిగా మార్చాలన్న డిమాండ్ ప్రజల నుంచి ప్రస్తుతం వినిపిస్తోంది. అలాంటి ప్రాంతాల్లో విశాఖ జిల్లా గోపాలపట్నం వద్దగల ఆర్.వెంకటాపురం గ్రామంలోగల ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమ స్థలం ప్రధానమైనది. అక్కడున్న పరిశ్రమలో గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేసిన సుమారు 372 మందిలో కొంత మంది ఈ నేపథ్యంలోనే విశాఖ కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం తరలివచ్చారు. తాము గతంలో పనిచేసిన చోట ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సంబంధిత స్థలంలో పరిశ్రమనైనా పెట్టండి.. లేదంటే భూములు వెనక్కి ఇవ్వండన్న డిమాండ్ వారి నుంచి వినిపించింది. 2021 మే 7న ఎల్‌జి పాలిమర్స్‌లో ప్రమాదం జరిగిన నుంచీ ఇప్పటివరకూ వేల కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడ్డాయంటూ ఈ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.వందల కోట్ల విలువైన భూముల్లో పరిశ్రమ

1960వ దశకంలో సుమారు 260 ఎకరాల రైతుల సాగుభూములను పరిశ్రమ కోసం తీసుకున్నారు. ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. పరిశ్రమ వస్తే ఉపాధి, ఉద్యోగాలు వచ్చి తమ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి జరుగుతుందని ఈ ప్రాంతానికి చెందిన పలు గ్రామాల ప్రజానీకం నాడు ఆశించారు. ఆశించినంతగా కాకపోయినా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జిల్లా అభివృద్ధి ప్రణాళిక విడుదల చేయాలి

తరలిరావాలని కోరారు. పారిశ్రామికాధిపతుల ప్రయోజనాల్లో మునిగి ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని అన్నారు. మూతపడిన మూడు సహకార చక్కెర కర్మాగారాలను ఆధునికీకరిస్తామన్న ఎన్నికల హామీని వైసిపి, కూటమి ప్రభుత్వాలు నిలబెట్టుకోవడంలేదన్నారు. చక్కెర ఫ్యాక్టరీలను ఆధునికీకరించి బెల్లం, చెరుకు రైతులను ఆదుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు శంకుస్థాపన తప్ప ఆ ప్రాజెక్టు పూర్తికి ఏ ప్రభుత్వమూ నిధులు సరిపడా కేటాయించడంలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తీరప్రాంతంలో పాయకరావుపేట నుంచి పరవాడ వరకు కాలుష్య పరిశ్రమల ఏర్పాటుతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు కాలుష్యంతో అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సేకరణలో భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, యువతకు స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రాయితీలు, ప్రోత్సాహకాలు నిలిపివేయాలన్నారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతంలో నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించాలని, జీడి, మామిడి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు.

విద్యుత్ భారాలు తగవు

ప్రభుత్వం తక్షణమే సర్దుబాటు ఛార్జీల పేరుతో వసూళ్లు చేస్తున్న విద్యుత్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని లోకనాథం డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎన్నికల వాగ్దానం ప్రకారం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంతృప్తే కొలమానం

పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని, కొత్త హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విఎంఆర్‌డిఎ, జివిఎంసి పరిధిలో చేపట్టే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, అనుమతుల జారీ విషయంలో పారదర్శకత పాటించాలని, వేగం పెంచాలని సూచించారు. 15 శాతం వృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని నిర్దేశించారు. ప్రతి నెలా ఒకటో తారీఖున ఠంచనుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేయాలన్నారు. రేషన్ సరుకులను కూడా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఇవ్వాలన్నారు. ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు కావాలని, మద్యం పాలసీకి అనుగుణంగా జిల్లాలో చర్యలు చేపట్టాలని, అవకవతకలు జరగకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. విద్యా, వైద్య రంగంలో ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, ప్రయివేటుకు ధీటుగా సేవలను విస్తృతం చేయాలని సూచించారు. గుంతలు లేకుండా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పరిశుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని అన్నారు. విశాఖ నగరాన్ని, ఇక్కడ ఉన్న గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, సిపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ స్థలంలో పరిశ్రమ వస్తేనే ఉపాధి

పరిశ్రమ వచ్చాక కొంత మార్పు గోపాలపట్నం ప్రాంతంలో జరిగింది. అయితే, ఎల్‌జి పాలిమర్స్ కంపెనీలో స్టైరీన్ గ్యాస్ లీకైన దుర్ఘటనలో 2020 మే 7న 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు మూడు రోజుల వ్యవధిలో మృత్యువాత పడ్డారు. రాష్ట్ర ప్రజలు ఈ ఘటనను నేటికీ మరచిపోలేదు. వేల సంఖ్యలో ఆ ప్రాంత జనం ప్రమాదకర విషవాయువును పీల్చి రోగగ్రస్తులుగా మారిన విషయం తెలిసిందే. అనంతర పరిణామాలతో అక్కడి పరిశ్రమ మూతపడింది. నాటి నుంచి ఆ ప్రాంత ప్రజలు, కార్మికులు ఉపాధి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. రూ.వందల కోట్ల విలువ పలికే తమ 260 ఎకరాల భూములపై రియల్ ఎస్టేట్‌దారుల కళ్లు పడడంతో వారిలో తాజాగా ఆందోళన ఎక్కువైంది. ఉపాధి లభిస్తుందని తమ తాతలు పరిశ్రమకు భూములిచ్చారని గుర్తుచేసుకుంటున్నారు. కాలుష్యం లేని పరిశ్రమను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వారి నుంచి వినిపిస్తోంది.

విశాఖ పోర్టు వేదికగా రేషన్ బియ్యం తరలింపు

ధర్మశ్రీ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఆరు నెలల్లో ప్రజలను ఉద్ధరించింది శూన్యమన్నారు. ప్రతి దానికీ గత ప్రభుత్వాన్నే నిందిస్తూ తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొద్ది రోజుల క్రితం కాకినాడ పోర్టుకు తనిఖీకి వెళ్లిన మంత్రి నాదెండ్ల మనోహర్ టిడిపి మంత్రికి చెందిన షిప్‌ను తనిఖీ చేయకుండా ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. బియ్యం అక్రమ రవాణా చేసే వారి తాట తీస్తామన్న ఆయన మాటలన్నీ తాటాకు చప్పుళ్లేనన్నారు. అవన్నీ కాలయాపన కోసం చేస్తున్న డ్రామాలే అని తెలిపారు. బ్రోకర్ సంస్థలతో కుమ్మక్కై, అది పిడిఎస్ బియ్యం అని తెలిసినా తనిఖీ చేయకుండా వెళ్లపోయారన్నారు. దీన్ని బట్టి బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వ పెద్దలే కవచంలా దగ్గరుండి ప్రోత్సహిస్తున్నట్టు అర్థమవుతోందన్నారు. టిడిపి సానుభూతిపరుడిగా ఉండి షిప్పింగ్ వ్యవస్థను శాసించే స్థాయిలో ఉన్న ఓ వ్యక్తి ఇప్పటికే 60 కంటైనర్లలో బియ్యం తరలించగా, మరో 110 టన్నులను ఇప్పుడు తరలిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం 10,600 టన్నుల బియ్యం దేశం దాటాయని, మరో వారంలో 90 కంటైనర్లలో బియ్యం తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రేషన్ బియ్యం అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరారు.

'ఉక్కు' కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం యాజమాన్యం తక్షణం కార్మికులకు వేతనాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1404వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉక్కు కార్మికులపై ఆర్థిక ఆంక్షలు విధించడం దారుణమన్నారు. జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. యాజమాన్యంలో జవాబుదారీతనం కొరవడిందని తెలిపారు. ఈ వైఖరిని నిరసిస్తూ, కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఉక్కు కార్మికుల కుటుంబాలతో ధర్నా నిర్వహించనున్నామన్నారు. దీక్షల్లో సంఘం నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, పాపారావు, ఎర్రయ్య, కె.అప్పారావు, ఎంవి.రమణ, మధు, రాజేశ్వరరావు, సోమేష్, నాగేశ్వరరావు, కె.మహేష్, ఎంఆర్‌కె.ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఘనంగా వైజాగ్ మీడియా క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజ సేవలో నిరంతరం బిజీగా గడుపుతూనే మరోవైపు జర్నలిస్టుల క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమని జివిఎంసి స్పోర్ట్స్ ఆఫీసర్ ఇఎ.అప్పలరాజు అన్నారు. విశాఖ మీడియా క్రికెట్ టోర్నీ సోమవారం జివిఎంసి ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రతి ఏటా జర్నలిస్టులు క్రికెట్ పోటీలు నిర్వహించుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దేహదారుఢ్యం లభిస్తుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ ఈ నెల 22 వరకు కొనసాగుతుందని తెలిపారు. టోర్నీ నిర్వాహకులు గాజుల గురు ప్రసాద్. కె.మదన్ పాల్గొన్నారు.



టోర్నీని ప్రారంభిస్తున్న అప్పలరాజు

ఆదిలక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎ పరిధిలో ఉన్న వైఎస్ఆర్ సెంట్రల్ పార్క్‌లో గార్డెన్ వర్కర్‌గా పనిచేస్తున్న కిలాని ఆదిలక్ష్మి ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు డ్యూటీ దిగిన సమయంలో గుండెపోటుతో మరణించిందని, డ్యూటీ సమయంలో చనిపోయిన ఆమె కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని, సంస్థలో పర్మినెంట్ ఉద్యోగాన్ని ఆమె కుమారుడికి ఇవ్వాలని విఎంఆర్‌డిఎ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. శంకరమఠం రోడ్డులో ఆదిలక్ష్మి భౌతికకాయానికి ఆయనతో పాటు సెంట్రల్ పార్క్‌లో పనిచేసిన కార్మికులు నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్‌కి వినతుల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంవి.ప్రణవ్ గోపాల్ నేతృత్వంలో ప్రారంభించిన ప్రజా దర్బార్‌కి ఈ సోమవారం వినతులు వెల్లువెత్తాయి. ప్రణవ్ గోపాల్‌తోపాటు కమిషనర్ విశ్వనాథన్ బాధితుల సమస్యలను తెలుసుకున్నారు.

నరేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లోన్ యాప్‌కి బలైన నరేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో యాప్ వేధింపులకు బలైన నరేంద్ర కుటుంబ సభ్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం లోన్ యాప్ వేధింపులకు తట్టుకోలేక నరేంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసినా ఫలితం కానరాలేదన్నారు. నరేంద్ర భార్య అఖిల దేవి మాట్లాడుతూ ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఎటువంటి న్యాయమూ జరగలేదన్నారు. ఆదాయం తెచ్చే ఇంటి పెద్దను కోల్పోవడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఆర్థికంగా సహాయం చేసి అర్హతకు తగినట్లుగా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా తన భర్త మృతికి కారణమైన లోన్ యాప్ నిర్వాహకులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కరించామని కలెక్టర్ కార్యాలయం నుంచి ఫోన్లు వస్తున్నాయని, కానీ తమకు ఎటువంటి న్యాయమూ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మత్స్య కార్మిక సంఘం సభ్యులతో కలిసి తమను ఆదుకోవాలని కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు.

చేనేత, కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరు పోలమాంబ ఆలయం పక్కన ఉన్న ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ సాయి చేనేత కాటన్ అండ్ సిల్క్ ఎక్స్ పోను సోమవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.ప్రణవ్ గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. ఈ ప్రదర్శన జనవరి 1 వరకు కొనసాగుతుందని అన్నారు.

శ్రీ సాయి మానస డార్మెటరీలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ సాయి మానస డార్మెటరీలో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే జిల్లా అదనపు అగ్నిమాపక శాఖాధికారి పి.సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది రెండు వాహనాల్లో అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. డార్మెటరీలో ఉన్న ఎసి పేలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, చుట్టుపక్కల ఉన్న అపార్టుమెంట్లకు, షాపులకు నష్టం వాటిల్లలేదని సింహాచలం మీడియాకు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు భావిస్తున్నారు.

పారిశ్రామిక రంగంపై కృత్రిమ మేధ

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక రంగంపై కృత్రిమ మేధ రానున్న రోజులలో గణనీయమైన ప్రభావం చూపనుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యాన సోమవారం ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)లో నిపుణులు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కండిషన్ మానిటరింగ్ అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని కండిషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, ఎన్ఎస్‌టిఎల్ అసోసియేట్ డైరక్టర్ డాక్టర్ గణేష్ కుమార్ ప్రారంభించారు. యంత్రాల దీర్ఘకాలిక పనితీరును మెరుగుపరచడానికి కండిషన్ మానిటరింగ్ అవసరమని తెలిపారు. పరిశ్రమలలోని విభాగాలను డిజిటలీకరించడం ద్వారా ఆయా విభాగాలలో యంత్రాల పనితీరుపై రోజువారీ సమాచారం లభిస్తుందని, ఆడేటాను విశ్లేషించడం వల్ల రాబోయే ప్రమాదాలు ముందుగా గుర్తించి యంత్రాలకు మరమత్తు చేయవచ్చని పేర్కొన్నారు. యంత్రాల డిజైనింగ్‌లో మార్పులు చేసుకోవడానికి కండిషన్ మానిటరింగ్ ఉపయోగపడుతుందన్నారు. రాబోయే దశాబ్దం ఇండస్ట్రీ 5.0లో కృత్రిమ మేధ మిషన్ లెర్నింగ్ పరిజ్ఞానం పరిశ్రమలను ముందుకు నడిపిస్తుందని, దానికి తగ్గట్లుగా సాంకేతిక నిపుణులు సిద్ధం కావాలని సూచించారు.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, మనిషి మేదస్సుకు సరైనది లేదని, అయితే కృత్రిమ మేధ పరిజ్ఞానం రాబోయే 50 సంవత్సరాలలో ప్రపంచ గమనాన్ని మార్చనుందని తెలిపారు. కృత్రిమ మేధకు గణిత శాస్త్రం ఆధారమని, ఖచ్చితమైన సమాచారం (డేటా)ను అందించినప్పుడే ఉత్తమ ఫలితాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేధ ఆధారిత కండిషన్ మానటిరింగ్‌పై ఐఐటి గౌహతి ప్రొఫెసర్ రాజీవ్ తివారి, ఐఐటి మద్రాస్ నిపుణులు డాక్టర్ పియూష్ సక్య పాల్గొని ప్రసంగించారు. కండిషన్ మానిటరింగ్ పరిజ్ఞానంపై అదాని పవర్ నిపుణుడు హేమంత్ బారీ, జిందాల్ స్టీల్ నిపుణుడు శివనాద్, విశాఖ స్టీల్‌ప్లాంట్ నిపుణుడు వంశీధర్, టాటా స్టీల్ నిపుణుడు జిఆర్‌పి.సింగ్, హెచ్‌పిసిఎల్ నిపుణులు డాక్టర్ దినకరన్, వి.రాజశేఖర్ ప్రసంగిస్తారని నిర్వహాక కమిటీ తెలిపింది. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, ఎఫ్‌డిపి కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఎమ్ఆర్ఎస్.సత్యంనారాయణ, ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


అతిథులను సన్మానిస్తున్నగీతం ప్రతినిధులు


ప్రారంభానికి నోచని అంగన్‌వాడీ భవనం

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని బిఆర్.తాళ్లవలస పంచాయతీ పరిధి బొత్సపేటలో సుమారు దశాబ్ద కాలం నుంచి అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. భవనం అంతా పూర్తయినా చిన్నపాటి పనులు నిలిచిపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం పరాయి కొంపలోనే కొనసాగుతోంది. కిటికీలు, తలుపులు, గేట్లు వేయాల్సి ఉంది. విద్యుత్ సౌకర్యం కల్పించి సున్నం వేస్తే భవనం పూర్తవుతుంది. ఈ పనులు పూర్తిచేయకపోవడంతో దశాబ్దకాలంగా ఈ భవనం నిరుపయోగంగా ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని భవనం పనులను పూర్తి చేసి అంగన్‌వాడీ కేంద్రానికి అప్పజెప్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'విజన్ 2047 కాదు 2024 - 29 కావాలి'

ప్రజాశక్తి-మాధవధార : రాష్ట్ర ప్రజలకు కావాల్సింది విజన్ 2047 కాదు.. 2024 – 29 అని పిసిసి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఒబిసి డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి మూల వెంకటరావు పేర్కొన్నారు. ప్రభుత్వానికి స్వల్పకాలిక లక్ష్యాలతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలు ఉండాలని తెలిపారు. ఇప్పుడు ఆరు నెలల్లో టిసిఎస్, గూగుల్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని, ప్రజలు ఇలాంటి వాటిని గుర్తిస్తారని పేర్కొన్నారు. 2047 నాటికి పేదరికం లేని సమాజాన్ని నిర్మిస్తామంటే ప్రజలు నమ్మరని, పేదరికం లేని సమాజం ప్రపంచంలో లేదని తెలిపారు. సంపన్న దేశాలలో సైతం పేదరికం ఉందని వివరించారు. అక్కడి ప్రభుత్వాలు కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. రానున్న నాలుగున్నర సంవత్సరాల్లో ఏం చేస్తారో చెప్పాలి, ప్రభుత్వ ఆలోచనలు ఆ దిశగా ఉండాలని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలని, ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ వంటివి రాష్ట్రానికి వచ్చేలా చూడాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని సూచించారు. రోజంతా కాన్ఫరెన్స్ అవసరం లేదని, ప్రజలకు ఏం కావాలో ముందే తెలుసుకొని ప్రభుత్వ అధికారులకు దిశా నిర్దేశం చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు.

పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ : ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మారికవలస గిరిజన గురుకుల పాఠశాలలో విద్యుత్తు శాఖ అధికారులు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను జోన్-3 డిఇ పోలాకి శ్రీనివాసరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ పొదుపు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ శివప్రసాద్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టివలస నాగ వంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాళ్ల గురునాయుడు ద్వితీయ వర్థంతి సందర్భంగా భీమిలి నియోజకవర్గ కెజిఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన చిట్టివలసలో సోమవారం ట్రస్టు చైర్మన్ కాళ్ల శ్రీనివాస్ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 500 మందికి అన్న దానం చేశారు. ట్రస్టు సభ్యులు పురుషోత్తం, సూర్యతో పాటు మాజీ కౌన్సిలర్లు చిలకా నరసింగరావు, పిట్ట వెంకటరావు, వర్తక సంఘం నాయకులు ఎం.గురునాథరావు, కె.అప్పారావు, స్థానికులు ఎస్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, ఎంపిడిఒ జానకి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 96 మందికి వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

ముగిసిన 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'



విజేతలతో గీతం ఇన్‌చార్జి వీసీ గౌతమ్‌రావు తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 సోమవారం ముగిసింది. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 290 మంది యువతీయువకులు ఈ పోటీలకు హాజరు కాగా 17 అంశాలపై జట్లు బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ, విపత్తుల నిర్వహణ, స్మార్ట్ ఎడ్యుకేషన్, రెన్యువబుల్ ఇంజినీరింగ్ అంశాలపై నూతన పరిష్కారాలను, ఆలోచనలను రూపొందించడానికి పోటీ పడ్డాయి. పోటీలలో తమిళనాడుకు చెందిన వివిధ ఇంజినీరింగ్ కళాశాలల జట్లు ప్రతిభను చూపి నగదు బహుమతిని, ప్రశంసా పత్రాలను అందుకున్నాయి. స్మార్ట్ ఎడ్యుకేషన్ అంశంపై సరికొత్త టెక్నాలజిని రూపొందించిన తమిళనాడుకు చెందిన బన్నారి అమ్మన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, కర్ణాటకకు చెందిన బిఎన్ఎమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి విజేతలుగా నిలిచాయి. విపత్తుల నిర్వహణపై నూతన ఆవిష్కరణకు గాను కోయంబత్తూర్‌కు చెందిన హిందుస్థాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఛత్తీస్‌గడ్‌కు చెందిన భిలాయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విజేతులుగా నిలిచాయి. సంప్రదాయేతర ఇందన వనరుల రంగంలో కొత్త సాంకేతిక పరికరాలను తయారుచేసిన తమిళనాడుకు చెందిన కెసిజి కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, కెఎల్ఎన్.కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విజేతలుగా నిలిచాయి. ఆర్థిక రంగంలో నూతన ఆవిష్కరణకు కర్ణాటకకు చెందిన జిఎమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విజేతగా నిలిచింది.

ముగింపు సభకు గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఐసిటిఇ డైరక్టర్ గరమరోహెల, ఇన్నోవేషన్ విభాగం సహాయ డైరక్టర్ డాక్టర్ ఎలగోవన్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి పరదేశిపాలెంలో రూ.13 లక్షలతో చేపట్టే రోడ్లు, కాలువలు పనులకు సోమవారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, పరదేశిపాలెంలో ఇప్పటికే రూ.16 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మించినట్లు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాల్లో కూడా రోడ్లు కాలువలు వేసేందుకు భూమిపూజ చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే సుమారు రూ.60 లక్షలతో వికలాంగుల కాలనీలో తాగునీటి పైప్ లైన్ల పనులు ప్రారంభమయ్యాయని, సాయిరాం కాలనీలో రూ.2.50 కోట్లతో వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. వార్డులో చాలాచోట్ల రోడ్లు, కాలువలు, మెట్ల మార్గాలు నిర్మించాల్సి ఉందని, దశలవారీగా అన్ని పనులూ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వాంద్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, కొండపు రాజు, జనసేన నాయకులు దేవర శివ, శ్రీకాంత్ రెడ్డి, బోర అప్పలసూరిబాబు రెడ్డి, గ్రామ పెద్దలు నీలి లక్ష్మణరావు, శివ, ఎర్రయ్య రెడ్డి మహిళలు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ హేమలత

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో ఉన్న సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఈ నెల 17, 18 తేదీల్లో మండల కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణా తరగతులకు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.


జోన్-5లో వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్

పిజిఆర్ఎస్‌కు అర్జీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో రెండు అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగానికి సంబంధించి చెరొక అర్జీ అందినట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. సంబంధిత అర్జీలను ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు తెలిపారు.

విశాఖపట్నం : జివిఎంసి జోన్-5 జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 2, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి చెరొకటి చొప్పున మొత్తం వినతులు వచ్చాయని జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇ ప్రసన్నరెడ్డి, బాబూరావు, రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ జనార్ధన్, ఎపిడిఎస్‌లు పుణ్యవతి, కృపానంద్ పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన అమెరికన్ ఎంబసీ అధికారులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికన్ కాన్సులేట్ అధికారులు సోమవారం సందర్శించారు. హైదరాబాదులోని యుఎస్ కాన్సులేట్ కార్యాలయం అమెరికన్ కార్నర్స్ ప్రోగ్రామింగ్ కో-ఆర్డినేటర్ మెలిసా నందుల, అమెరికన్ కౌన్సులేట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కాలే నందుల ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయరావుతో సమావేశమయ్యారు.

పద్మనాభనగర్ స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలి

ప్రజాశక్తి -గోపాలపట్నం : పద్మనాభనగర్ గ్రామం ఏర్పడి 48 సంవత్సరాలు పూర్తికావస్తున్నప్పటికీ నివాస స్థలాలు రిజిస్ట్రేషన్ కాలేదని, వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని పద్మనాభనగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు కోరారు. జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1976 సంవత్సరంలో మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం కోసం పద్మనాభనగర్ వాసుల ఇళ్ల స్థలాలు, పంట పొలాలను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. అప్పట్లో ఎకరాకు రూ.2,000, 240 గజాల ఇంటి స్థలం మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఇంటి స్థలాలకు నాడు ఎల్‌పిసిలు మాత్రమే ఇచ్చి పట్టాలు తర్వాత ఇస్తామన్నారని, నేటికి 48 సంవత్సరాలు పూర్తయినప్పటికీ రిజిస్ట్రేషన్ అయ్యే పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్లు అయ్యేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కంపరపాలెం కాలనీలో జరుగు రెవెన్యూ సదస్సులో విన్నవించుటకు గ్రామ అభ్యుదయ యువజన సేవా సంఘ సభ్యులు తీర్మానం చేశారు. గ్రామంలో ఉంటున్నవారు ఈ సదస్సులో పాల్గొని తమ ఇబ్బందులు తెలియజేయుటకు తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు సాలాపు శ్రీనివాసరావు, కంపర అప్పారావు, గనిశెట్టి అప్పలరాజు, కంచిపాటి నాగరాజు, వల్లూరి జగదీష్, చంద్రశేఖర్, కంచిపాటి వెంకటరమణ, నందవరపు హరనాథ్, కంపర కనకరాజు, కట్ట పెంటయ్య, మనోజ్‌కుమార్, మత్స్యపురి గౌరీప్రసాద్, పిల్ల వెంకటరమణ, ఎవి.సూర్యనారాయణ, దమ్ము శ్రీను, రమేష్, ప్రసాదు, సాలాపు ఉపేంద్ర పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న విశాఖ డెయిరీ కార్మికులు

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు ఎం.రాంబాబు యాజమాన్యాన్ని హెచ్చరించారు. సమస్యలపై విశాఖ డెయిరీ కార్మికులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి రాంబాబు మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గత కొన్ని రోజులుగా డెయిరీ కార్మికుల ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకపోవడం పద్ధతి కాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, ఐదేళ్లు సర్వీసు దాటిన కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పి.భాస్కరరావు, నాగమరిని బాబు, ఎస్.రమణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి శానాతివానిపాలెం ముత్యమాంబ కాలనీలో రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు సమక్షంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్తూ ప్రతి వార్డులో సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. స్థానికులకు ఏ సమస్య ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేయాలని సూచించారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హైమావతి, పిల్లా జగన్మోహన్‌పాత్రుడు, త్రిబుల్ ఎస్.రమేష్, లక్కీ గోవింద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం



హెచ్‌బి.కాలనీలో బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల నిరసన తెలిపారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

ఎంవిపి.కాలనీ : పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం హెచ్‌బి.కాలనీ బస్ స్టాప్ వద్ద సిపిఎం 15, 16 వార్డు శాఖల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందం తీవ్ర నష్టదాయకమన్నారు. రెండేళ్ల క్రితం వాడిన కరెంట్‌కు ఇప్పుడు ట్రూఅప్, ఇంధనపు ఛార్జీలు, ఎఫ్‌పిపిపిఎ పేరుతో రూ.18 వేల కోట్లు భారం వేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆమోదం లేకుండా అదానీ లాభాల కోసం భారాలు వేయడాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలలో జగన్మోహన్‌రెడ్డి రూ.1750 కోట్లు ముడుపులు తీసుకున్నారని బట్టబయలైనా టిడిపి కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దుచేయలేదు సరికదా కనీసం జగన్మోహన్‌రెడ్డి అరెస్టుకు కూడా పూనుకోలేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు ఎం.ప్రదీప్, జివిఎన్.చలపతి, జిఎస్.రాజేశ్వరరావు, జివి.రమణ, కె.కుమారి, షరీఫ్, బేగం తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యాన 94వ వార్డు పరిధి అప్పలనరసయ్య కాలనీలో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు బి.రమణి మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారన్నారు. ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించకపోతే మరో విద్యుత్ పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, తిరుపతిరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం బస్సు స్టాప్ కూడలిలో సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేసి అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ నాయకులు ఎస్.అప్పలనాయుడు, కె.నాగరాణి మాట్లాడుతూ, నిత్యావసరాల ధరలు పెరుగుదలతోపాట విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం పెంచి ప్రజలను కోలుకోలేని దెబ్బతీస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించి అదానికి రూ.కోట్లలో లాభాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికులు శివశంకర్, బంగారునాయుడు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి అప్పలనరసయ్య కాలనీలో బిల్లులను దగ్ధం చేస్తున్న నాయకులు



ఆనందపురం కూడలిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మహిళా ఐపిఎల్‌కు ఆంధ్రా అమ్మాయి



ప్రజాశక్తి -మధురవాడ : మహిళా ఐపిఎల్‌కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అమ్మాయి ఎంపికైంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) 2025 సీజన్ కోసం బెంగళూరు వేదికగా జరిగిన పేయర్ల మినీ వేలంలో ఆంధ్ర నుంచి ఎన్.శ్రీ చరణిని ఢిల్లీ క్యాపిటల్స్ రూ.55 లక్షలకు దక్కించుకుంది. కడపకు చెందిన శ్రీచరణి చదువులో రాణిస్తూనే అండర్-19, అండర్- 23 స్టేట్ మ్యాచ్‌ల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. డబ్ల్యుపిఎల్‌లో అవకాశం దక్కించుకున్న శ్రీచరణిని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు.

రేపటి రెవెన్యూ సదస్సుకు మంత్రి అనగాని రాక

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం బోని గ్రామపంచాయతీలో బుధవారం జరిగే రెవెన్యూ సదస్సుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ హాజరవుతారని మండల తహశీల్దార్ పేర్ని శ్యామ్ ప్రసాద్ తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

మాటల కంటే పనులతో మేలు

నేవల్ సివిల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ రక్తదాన శిబిరంలో కమోడోర్ అజ్మతుల్లా ఖాన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాటల కంటే చేసే పనులు సమాజానికి, తోటి వారికి తోడ్పడతాయని నేవల్ డాక్ యార్డ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కమోడోర్ అజ్మతుల్లా ఖాన్ అన్నారు. ది ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ 70 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మేఘాద్రిపేట కాలనీలోని కళామేఘా ఆడిటోరియంలో సోమవారం సొసైటీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అజ్మతుల్లా ఖాన్ హాజరై మాట్లాడారు. సభ్యులకు సొసైటీ హితోధిక సేవలందిస్తోందని చెప్పారు. రక్తదానం గొప్ప కార్యక్రమం అని, ఇందులో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలిపారు. సొసైటీ పురోభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డాక్‌యార్డు ఉద్యోగులు, కార్మికులకు హెచ్‌ఆర్ డివిజన్ అన్నివేళలా అందుబాటులో ఉంటుందని, సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించడానికి ప్రయత్నిస్తామన్నారు. అనంతరం రక్త దాతలందరికీ జ్ఞాపికలను సొసైటీ బహుకరించింది.



రక్తదానం చేసిన నేవీ సివిల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

గౌరవ అతిథిగా పాల్గొన్న సొసైటీ సూపర్‌వైజరీ కమిటీ సభ్యులు రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, తీవ్ర నష్టాలు పాలైన సొసైటీ తిరిగి లాభాల్లోకి అడుగుపెట్టిన శుభ సందర్భంగా 1992 సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా సొసైటీ సభ్యులు రక్తదానం చేస్తున్నారని తెలిపారు. అవయవదానంపై కూడా సభ్యులను చైతన్యవంతం చేయాలని కోరారు. మరో ముఖ్య అతిథి, మదర్ బ్లడ్ సెంటర్ అధ్యక్షులు జిఎల్ఎల్.కిరణ్ మాట్లాడుతూ, అడిగిన వెంటనే రక్తదానం ఏర్పాటుచేసిన సొసైటీ పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు.

సొసైటీ కార్యదర్శి యడ్ల అంజనీ రాజేష్, అధ్యక్షులు విప్లవ కుమార్ మాట్లాడారు. 200 మంది రక్తదానం చేశారు. శిబిరం నిర్వహణకు పాలకవర్గ సభ్యులు, ఎన్‌సిఇ యూనియన్ నాయకులు, సొసైటీ సిబ్బంది సహకరించారు.

బకాయి జీతాలు చెల్లించాలని..

శానిటేషన్ వర్కర్ల ధర్నాలు



విశాఖ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

బకాయి పడిన ఐదు నెలల జీతాలను వెంటనే చెల్లించాలంటూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం ధర్నాలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

విశాఖ కలెక్టరేట్ : బకాయి వేతనాల కోసం విశాఖ కలెక్టరేట్ ఎదుట శానిటేషన్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.మంగశ్రీ మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేసామని, వెంటనే జీతాలు చెల్లిస్తామని ప్రకటనలు చేయడం తప్పితే జీతాలు చెల్లించడం లేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఒక నెల వేతనం కూడా ఇవ్వలేదని వాపోయారు. దీంతో శానిటేషన్ వర్కర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి, యూనియన్ నాయకులు లక్ష్మి, ఎల్లమ్మ, కుమారి, మల్లిక, అచ్చమ్మ, గౌరి పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం పాఠశాల శానిటేషన్ వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం డిఇఓకి, ఆర్డిఓ కార్యాలయ ఏవోకి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు కరోనా సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేశారని, అయినప్పటికీ వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలనే ప్రభుత్వ నిర్ణయం వల్ల ఆయాలపై విపరీతమైన పనిభారం పెరిగిందని, దానిని వెంటనే పున:పరిశీలించి, 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి లక్ష్మి, వడ్డాది రూపావతి, యర్రంశెట్టి హారిక, నిమ్మకాయల నూకరత్నం, బొమ్మాల తులసి, వై.ఎర్నమ్మ, సింగంపల్లి అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కశింకోట ఎంఇఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి, కమిటీ సభ్యురాలు లక్ష్మి, గౌరవాధ్యక్షురాలు ఎం శ్రీదేవి, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్.రాయవరం మండలం కుర్రపోలు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ ఏడిద కుమారి పాఠశాలలోని బాత్రూములు కడుగుతూ కాలుజారిపడి అకాల మరణం చెందారని, తక్షణమే ఆమె కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించి కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, వర్కర్లు ఎం.లక్ష్మి, పి.రమణమ్మ, ఏ.దేవి, జె.సునీత, వై.సన్యాసమ్మ, సిహెచ్. వెంకయ్యమ్మ, ఎస్.రవణమ్మ, ఎం.వరలక్ష్మి, పి.అప్పలనరస, ఎన్.రత్నం, ఎన్.మంగ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి డిఇఒ కార్యాలయం వద్ద...

యలమంచిలి : యలమంచిలి డిప్యూటీ డిఇఒ కార్యాలయం ముందు శానిటేషన్ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండడం వలన కుటుంబాల పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జానకి మాట్లాడుతూ బ్లౌజులు, శానిటేషన్ చీపుర్లు, ఫినాయిల్ ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, శకుంతల, మణి, రాణి, నూకరత్నం, సత్యవతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరుతూ చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్.రాజు, ఎంఇఒకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రాజకీయ కక్షసాధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవి, ఉమా, సంతోషి, పరదేశమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : సిఐటియు ఆధ్వర్యాన శానిటేషన్ వర్కర్లు స్థానిక గాంధీ పార్క్ నుండి ఎంఇఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎంఇఒ .ఎం.పాండురంగారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు ఇరట. నరసింహమూర్తి, కె.భవాని. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రవి మాట్లాడుతూ అరకొర వేతనాలతో పనిచేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలాగని ప్రశ్నించారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ మహాలక్ష్మి. జోగల సంతోషి కొండమ్మ పాల్గొన్నారు.



చోడవరం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వర్కర్లు



పదో తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నేతలు

పదో తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) తయారు చేసిన పదో తరగతి మోడల్ టెస్టు పేపర్లను అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు చేతుల మీదుగా డీఈఓ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులకు, విద్యారంగానికి మాత్రమే కాకుండా పదవ తరగతి విద్యార్థులకు కూడా సేవ చేయడం సంతోషకరమన్నారు. ఈ పుస్తకంలో ఏడు సబ్జెక్టులకు చెందిన ముఖ్యమైన ప్రశ్నలు సారాంశం ఉన్నట్లు చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ గత సంవత్సరం యుటిఎఫ్ మోడల్ పేపర్స్ చదివిన విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రమా జ్యోతి, ఏఎస్ఓ వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజనాయుడు, మోడల్ స్కూల్స్ నాయకులు నూతన్, అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్ సీనియర్ నాయకులు దేవుడు నాయుడు, సలీం, తేజ్ వర్ధన్, జగన్, రెడ్డి అర్జున్, బాషా తదితరులు పాల్గొన్నారు.

వైబ్రాంట్ డైట్ ఫెస్ట్ 2కె 25 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో "వైబ్రాంట్ డైట్ ఫెస్ట్ 2కె 25" పోస్టర్ సోమవారం కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025, ఫిబ్రవరి 6, 7 తేదీలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటూ ఆటలు, వినోదం, సాంస్కృతిక నృత్యాలు, సాంకేతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడల విభాగంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాటిల్ ఆఫ్ డ్యాన్స్, మిస్టర్ అండ్ మిస్ డైట్, సోలో డ్యాన్స్, గ్రూప్ డ్యాన్స్, ఫోటోగ్రఫీ, ఫేస్ పెయింటింగ్, గానం, షార్ట్ ఫిల్మ్‌లు, రీల్ కాంటెస్ట్ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. టెక్నికల్ ఈవెంట్‌లో భాగంగా హ్యాకథాన్, టెక్నికల్ ట్రెజర్ హంట్, టెక్నికల్ పిక్షనరీ, ఫన్ ఫియస్టాలో భాగంగా లక్కీ సర్కిల్, బ్లాస్ట్ ది టమ్మీ లౌడ్ ఇన్ ది క్రౌడ్, పాస్ ది సిగ్నల్, రన్ రౌండ్ ది రింగ్ వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు ప్రైజ్ మనీ రూ.15 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ గణేష్ ప్రసాద్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

జీవితంలో అడ్డంకులను ఎదుర్కోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కోవాలని సినీ నటుడు సుమన్ అన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లి తండ్రి గురువు ప్రత్యక్ష దైవాలని, వారి శ్రమను, త్యాగాలను గుర్తించాలని కోరారు. అనంతరం సుమన్‌ను, నిజి షోకొటాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ కోచ్ ఎస్‌పిఎండి నాయుడు, కాంద్రేగుల శ్రీరామ్‌ను కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ గజమాల, శాలువాతో సత్కరించి మొమెంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, టిపిఓ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సుజల స్రవంతిని పూర్తి చేస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి : బాబు జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నూతనంగా ఎన్నికైన సాగు నీటి సంఘాల సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 కోట్లతో అనకాపల్లి నియోజకవర్గంలోని సాగు నీటి కాలువలు, చెరువులు, గ్రోయిన్లు మరమ్మతులకు, అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని చెప్పారు. అనంతరం నియోజకవర్గంలోని 23, కృష్ణం రాజు, నర్సాపురం ఆనకట్టు సాగు నీటి సంఘాల సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.

విద్యార్థులకు దోమ తెరలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-యలమంచిలి

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు దోమ తెరలు ఇప్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ యలమంచిలి ప్రాంతంలో నాలుగు హాస్టళ్లు ఉన్నాయని, అందులో సుమారు 400 మంది విద్యార్థులున్నారని తెలిపారు. వారికి దోమల బెడద ఎక్కువై వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో దొరబాబు ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు శంభువానిపాలెం గ్రామానికి చెందిన ఉగ్గిన అప్పన్నదొర (దొరబాబు) రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. కృష్ణా జిల్లా గుడివాడ, ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో 48 సంవత్సరాల పురుషుల విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్ క్రీడాంశాలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. నేవీలో విధులు నిర్వహిస్తూ, క్రీడలపై ఆసక్తితో ఈ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించానని దొరబాబును గ్రామస్తులు అభినందించారు.

పివిజికి అభినందనలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన పివిజి.కుమార్‌ను అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు సోమవారం ఘనంగా సత్కరించారు. సోమవారం మండల పరిషత్ సమావేశానికి హాజరైన పివిజిని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాంబశివరావు, వైస్ ఎంపిపి రొంగలి సూర్యనారాయణ, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, జూరెడ్డి రాము పాల్గొన్నారు.



జాతీయ అవార్డులు పొందిన సర్పంచులను అభినందిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

మరిన్ని అవార్డులు సాధించాలి

జిల్లా కలెక్టరు విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలకు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పంచాయతీ అవార్డులు రావడం సంతోషకరమని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. జిల్లాకు మరిన్ని అవార్డులు సాధించాలని కోరారు. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పంచాయతీ అవార్డులు (దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారం -2024) పొందిన నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు, అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావులను సోమవారం కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు విజయ కృష్ణన్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రతి పంచాయతీని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు. శాఖలకు ఇచ్చిన లక్ష్యాలకు మించి పనిచేయాలని, అన్ని రంగాలలో జిల్లాను ఉత్తమ స్థానంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, డీపీవో ఆర్.శిరీషారాణి, డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ ఈ.నాగలక్ష్మి, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరహాలబాబుకు అభినందనలు

నక్కపల్లి : జాతీయ అవార్డు అందుకున్న న్యాయంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలుబాబును నక్కపల్లి వైసిపి నేత వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పొడగట్ల వెంకటేశ్వరరావు, పాపారావు, వెదుళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : అమృత సరోవరం పథకంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు చెరువులను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఏపిఓ వరహాలు బాబు తెలిపారు. సోమవారం మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు ఎంపీడీవో విజయలక్ష్మి కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా 27 చేపల చెరువుల తవ్వకానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గ్రామాలలో చెరువుల గట్లు విస్తీర్ణం ఆధారంగా బుచ్చయ్యపేటకి 200, ఐతంపూడి 150, దిబ్బిడికి 100, కొండపాలెంకి 350, కరకకి 200, పోలేపల్లికి 200, సీతయ్యపేటకి 100 చొప్పున 7 పంచాయతీలకు మొత్తంగా 1300 కొబ్బరి మొక్కలు పంపిణీ చేశాసినట్లు చెప్పారు

ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం గ్రామంలో శ్రీమర్లమాంబ ఆలయం ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిపి బోకం సూర్యకుమారి శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ నిధులు రూ.5 లక్షలతో ఈ ప్రహరీ నిర్మాణం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచి దెడ్డం ప్రసాద్, ఎంపీటీసీలు వీరప్ప శ్రీను, బైలపూడి దేముడు బాబు, ఉపసర్పంచి మండల లక్ష్మణ, వార్డు మెంబర్లు పోతల కనకరాజు, గొర్లి శ్రీనివాస్, బొకం రామకృష్ణ, ఎస్ శివ, పాల సొసైటీ అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, కిల్లి వెంకట సత్యనారాయణ, రెడ్డి దేవుడు బాబు, ఎస్. నాగభూషణం, పోతల అప్పలనాయుడు, ఎస్ నాగేంద్ర, ఎస్.సత్యనారాయణ, పోతల రమణ, కిల్లి శ్రీనివాస్, కిల్లి గోవింద్, కర్రి సత్యనారాయణ, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి తనయుడు గండి వంశీ ఆధ్వర్యంలో గీతం హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హాస్పిటల్ జనరల్ మెడిసిన్ వైద్యులు ఉదయ్ కుమార్, ఆర్థోపెడిక్ ఆజ్మల్, న్యూరో సర్జన్ కసిఫా, భవ్య, గైనకాలజిస్ట్ అమూల్య, పీడియాట్రిక్స్ గీతిక, జనరల్ సర్జన్ శ్రీనివాస్, స్కిన్ సర్జన్ యసివర్మ తదితరులు సుమారు 276 మంది రోగులను పరీక్షించి, టెస్టులు చేసి మందులు ఉచితంగా అందజేశారు. 96 మంది రోగులకు ఆపరేషన్ నిమిత్తం గీతం హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండి వంశీ దీప్, తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, బయలపుడి రాంబాబు, రమేష్, మహేష్, గండి సత్యం, నరేష్, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, దొడ్డి రాంబాబు, అయినింటి రాజు, లైన్మెన్ నాయుడు, పోతునాయుడు, పాల్గొన్నారు.

గ్రోయిన్ చైర్మన్ గోవిందకు సన్మానం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఉగ్గినిపాలెం గ్రోయిన్ చైర్మన్‌గా ఎన్నికైన బద్ది గోవింద్‌ను సోమవారం రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యాన సన్మానించారు. కార్యక్రమంలో పరవాడ పాలెం సర్పంచ్ బలిజి మంగ ముసిలినాయుడు, మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య, ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వరరావు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల వేణుగోపాలస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఉప ఆలయంలో గ్రామానికి చెందిన పడాల గణపతి రావు శారద దంపతుల కుమార్తె సరిత దంపతులు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సుమారు లక్ష రూపాయల విలువైన ఉత్సవ విగ్రహాలను వితరణ చేశారు. వారి ఇంటి నుంచి మేళ తాళాలతో పెద్ద ఎత్తున గ్రామస్తులతో కలిసి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని వేద పండితుల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించే విగ్రహాలను ఆలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నడిపల్లి బోసు బాబు, బుదిరెడ్డి నరసింగరావు, గొంతిన శ్రీనివాసరావు, బుదిరెడ్డి సూరిబాబు, సిహెచ్ వెంకటపతి రాజు, గొంతిన వెంకటరావు, పన్నీరు చంటి, సిరిసాల నాగు, అప్పన వరప్రసాద్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలకు పూజ చేస్తున్న దృశ్యం

తీరప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టరు విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాలమైన సముద్రతీరం, కీలకమైన పరిశ్రమలు కలిగిఉన్న దృష్ట్యా జిల్లాలో పర్యాటకుల రక్షణకు, తీర ప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో తీరప్రాంత రక్షణ పోలీసు జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాలను సందర్శించే పర్యాటకుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ పర్వదినాలు సందర్భంగా సముద్ర స్నానాలు సమయాలలో ప్రత్యేక సిబ్బందిని నియమించడానికి ముందుగా పండుగల కేలెండరు తయారు చేసుకోవాలని సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లే ప్రతి బోటుకు రిజిస్ట్రేషను ఉండాలని తెలిపారు. సముద్ర తీరంగుండా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిఘా ఉండాలని ఆదేశించారు. మెరైన్ ఎడిషనల్ ఎస్‌పి జిబిఆర్.మధుసూధనరావు మాట్లాడుతూ పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషను ద్వారా పటిష్టమైన నిఘా కొనసాగుతుందని తెలిపారు. పర్యాటకుల రద్దీను దృష్టిలో ఉంచుకొని గజఈతగాళ్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఎం.దేవప్రసాద్, డిసిఐఒ డి. శంకర్ ప్రసాద్, కస్టమ్ సూపరిటెండెంటు అతుల్ కుమార్ సింగ్, జిల్లా మత్స్యశాఖ అధికారి టివివి.ప్రసాద్, అదాని పోర్టు డిప్యూటీ మేనేజర్ బి.గోవిందవర్మ, సిఐఎస్ఎఫ్ తరపున కెఎ.సతీష్, డిప్యూటీ కమాండర్ వికె.సాహు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి



సిపిఎం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నేతలు

ప్రజాశక్తి-మునగపాక

డిసెంబర్ 20 నుండి 22 వరకు మూడు రోజుల పాటు నర్సీపట్నంలో జరుగు సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మెయిన్ రోడ్‌లో గల పిఎసిఎస్ ఆవరణలో సోమవారం మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను సిపిఎం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలతో పాటు భూ సమస్యలు, రోడ్లు, విద్యా, వైద్యం వంటి సౌకర్యాల కోసం గళం ఎత్తుతుందన్నారు. కార్మికులు, స్కీం వర్కర్లు చేస్తున్న పోరాటాలకు అండగా సిపిఎం నిలిచిందని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, కౌలు రైతుల సమస్యలపైనా, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపైనా అనేక ఉద్యమాలు చేసినట్లు చెప్పారు. మహాసభ సందర్భంగా ఈ నెల 21న జరుగు ర్యాలీ, బహిరంగ సభకు ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, సంజీవరావు, రాము, నర్సింగరావు, గణేష్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి-కె.కోటపాడు

పల్లె పండుగలో గ్రామాలకు కేటాయించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ ఇంజనీర్ సుమతి కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత వైసిపి పాలనలో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలకు నేటికీ బిల్లులు మంజూరు చేయలేదని వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. దీనికి స్పందించిన మండల ఇంజనీర్ పల్లె పండుగలో చేపట్టిన పనులకు, జిల్లా పరిషత్ పనులకు, హెల్త్ వెల్నెస్ కేంద్రాలకు నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎంపీడీవో సాంబశివరావు ప్రవేశపెట్టిన 2024 - 25 మండల పరిషత్ బడ్జెట్ 2025 - 26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. సవరణ బడ్జెట్ రాబడులు 64 కోట్ల 30 లక్షల 68000 కాగా 61 కోట్ల 795 లక్షల 49000 వ్యయంగా చూపించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ పరిపాలనాధికారి అప్పలరాజు వెలమ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీవీజి కుమార్, ఎంఇఒలు కే సత్యనారాయణ, డివిడి ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీలు సమర్పించే అర్జీదారులకు వారు సంతృప్తిచెందే విధంగా పరిష్కారం లేదా సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టరుతో పాటు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వైఎస్‌వికెజిఎస్ఎల్ సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 193 అర్జీలు రాగా, అత్యధికంగా 134 రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదలు అందాయి. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో 35 ఫిర్యాదులు

ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ 35 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, ఎస్పై డి.వెంకన్న పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమైందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగులకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణను ఇచ్చారు.



వికలాంగుల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి వికలాంగుల ఆటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 3 అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్లో సోమవారం వికలాంగుల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను ఎస్‌డి గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ జెండా ఊపి ప్రారంభించారు. నాలుగు విభాగాలుగా అంగవైకల్యం, అంధులు, బదిరులు, వికలాంగ పిల్లలు నాలుగు విభాగాలుగా కేటాయించి ఈ పోటీలు నిర్వహించారు. ట్రై సైకిల్ రేస్, బ్యాటరీ ట్రై సైకిల్ రేస్, రన్నింగ్, జావ్లీన్ త్రో, డిస్క్ త్రో, షాట్ పుట్, క్యారమ్స్, చెస్, సింగింగ్ తదితర పోటీలు నిర్వహించి, కాండ్రేగుల శ్రీరామ్ చేతుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కనిశెట్టి సురేష్ బాబు, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, రైతు స్వరాజ్య వేదిక గాడి బాలు, ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు డొక్కరి హరీష్, మొల్లి చంద్రశేఖర్, కోరుకొండ నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌సి హాస్టల్‌లో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక ఎస్సీ హాస్టల్లో సోమవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. చీపుర్లు పట్టి హాస్టల్ పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. హాస్టల్లో తాగిన మద్యం బాటిల్ పడి ఉండటాన్ని చూసిన సర్పంచ్ దిమ్మల అప్పారావు హాస్టల్ పరిసరాలలో త్రాగిన, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం ,ఎస్పై పి ప్రసాదరావు, సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేటి నుండి మొబైల్ ఆధార్ కేంద్రాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఈ నెల 17 నుండి చిన్నపిల్లల మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాంబశివరావు తెలిపారు. 17, 18 తేదీల్లో చౌడువాడ సచివాలయంలోనూ, 19, 20 తేదీల్లో కే కోటపాడు, 26, 27 తేదీల్లో కే సంతపాలెం, 28వ తేదీన ఏ కోడూరు సచివాలయంలోనూ ఈ మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ఆయా పరిసర గ్రామాల ప్రజలు కూడా అదే ఆధార్ కేంద్రాల్లో తమ పిల్లలకు ఆధార్ కార్డు పొందవచ్చని తెలిపారు.

అమర జవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరంలో అమర జవాన్ పడాల వరహాలు కుటుంబానికి సైనిక్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట రెడ్డి విజయవాడ నుండి ప్రత్యేకంగా ఇక్కడికి వచ్చి వరహాలు బాబు సతీమణి తులసికి రూ.50వేలు, తల్లిదండ్రులకు మరో రూ.50వేలు ఆర్థిక సాయం చెక్కులను అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యానందం, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అగ్గాల హనుమంత రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-యలమంచిలి : జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, పనిముట్లు, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, 200 పని దినాలు కల్పించాలని, కనీస రోజు కూలి రూ.600 చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్ఆర్ఇజిఎస్ సోషల్ ఆడిట్‌కు సోమవారం విచ్చేసిన డిఆర్‌డిఎ పీడీకి శివాజీ వినతిపత్రం సమర్పించారు. గతంలో మంచినీళ్లకు, పనిముట్లకు డబ్బులు ఇచ్చేవారని, సమ్మర్ అలవాన్స్ చెల్లించేవారని,కాని నేడు అవేవీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయట ధరలు చూస్తే విపరీతంగా పెరిగాయని, కానీ కూలి మాత్రం రూ.300కు మించి రావడం లేదని తెలిపారు. ఎలమంచిలి మున్సిపాలిటీలో గ్రామీణ ప్రాంతమే ఎక్కువగా ఉందని, మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపాలెం, సోమలింగపాలెం, జంపాలెం, రామారాయుడుపాలెం, తురంగలపాలెం, కొక్కిరాపల్లి, పెద్దపల్లి, కట్టుపాలెం, తెలుగుపల్లి తదితర గ్రామాలు, యలమంచిలిలో ఉన్న కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుర్లగ్నం ఘడియల్లో నెలగంటతో ధనుర్మాసోత్సవాలను ఆలయ అర్చకులు ప్రారంభించారు ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘంటానాదం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం గరుడ వాహనంపై ఉభయదేవేరులతో శ్రీనివాసుని ఉత్సవమూర్తులను, పల్లకీపై గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను అధిష్టించి, తిరువీధి సేవ నిర్వహించారు. అమ్మవారి సన్నిధి వద్ద అర్చకులు, వేదపండితులు, ప్రముఖ కవయిత్రి డాక్టర్ గాయత్రీదేవి తిరుప్పావై పాశరవిన్నపం చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు తిరువీధి సేవలు జరుగుతాయని, భక్తులంతా భాగస్వాములు కావాలని కోరారు.

రావికమతం : స్థానిక శివాలయంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేకువజామునుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. దేవాలయ అర్చకులు రాచకొండ ఆంజనేయమూర్తి బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భోగీ వరకు జరిగే ధనుర్మాసోత్సవాల్లో ఊరూరా, వాడవాడలా మేలుకొలుపు బృందాల నగర సంకీర్తన నిర్వహిస్తారు.ఇంటింటా ముంగిట్లో నెల గంట ముగ్గులు, సంక్రాంతి ముగ్గులు వేసుకొని భక్తిభావం చాటుకుంటారు. నెలరోజులు ధనుర్మాసం తర్వాత అన్నసమారాధనలు, తీర్థాలు నిర్వహిస్తారు. పలువురు స్వామీజీలు, పీఠాధిపతుల ఆధ్యాత్మిక ప్రసంగాలతో పండుగ సందడి నెలకొంటోంది.

గొలుగొండ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పాతకేడిపేటలో నగర సంకీర్తన నిర్వహించారు. నెలరోజులపాటు ప్రతిరోజూ ఇలా నగర సంకీర్తన నిర్వహిస్తామని భక్తులు, ప్రజలు తెలిపారు.

అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో చినపాచిల గ్రామంలో పి. కోటేశ్వరరావుకు చెందిన వరిగడ్డి కుప్ప సోమవారం దగ్ధమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు రావికమతం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అది మరమ్మతుకు గురికావడంతో, మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. ఏడాది పొడుగునా పశువులకు దాణా కోసం ఉంచిన గడ్డివామి కాలి బూడిదవ్వడంతో రైతు కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ. పదివేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

అన్నదాతల్లో అల్పపీడనం గుబులు

వరుస తుపాను హెచ్చరికలతో కలవరం



కోతకు సిద్ధంగా ఉన్న వరి పైర్లు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఇటీవల వరుస తుఫాన్ హెచ్చరికలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి, పండించిన పంటలు చేతికందే సమయంలో తుఫాన్ హెచ్చరికలతో అన్నదాత ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నాడు. వరి కోతల సమయంలో అన్నదాతకు చినుకు భయం పట్టుకుంది. ఇప్పటికే మండలంలో రైతులు కోతలు ప్రారంభించారు. కొన్నిచోట్ల పొలాల్లోనే కోసిన వరి పనలు ఉండగా, మరికొన్నిచోట్ల కుప్పలు వేశారు. ఈ సమయంలో ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో వర్షం కురిస్తే అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మండలంలో మునుపెన్నడూ లేని విధంగా ప్రస్తుత ఖరీఫ్‌లో 4400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వరి ఆశాజనకంగా ఉంది. ఉపమాక, జానకయ్యపేట, నక్కపల్లి, చినదొడ్డిగల్లు, కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్ట, డొంకాడ, జి



పొలాల్లో కోసిన వరి పనలు


జగన్నాధపురం, ముకుంద రాజుపేట తదితర గ్రామాల్లో వరి కోత దశకు చేరుకోవడంతో రైతులు కోతలు ప్రారంభించారు. కొన్ని చోట్ల ఇప్పటికే కోసిన వరి పనలు పొలాల్లో ఉండగా, కొన్నిచోట్ల కుప్పలు వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమయంలో వర్షం కురిసినట్లయితే కోసిన వరి పనలు తడిసిపోవడం తోపాటు నీటి ముంపునకు గురైతే నష్టం జరుగుతుందని, కోతకు సిద్ధంగా ఉన్న పైర్లు నేలకొరిగితే అన్నదాతకు కోలుకొని దెబ్బ తగులుతుందని ఆవేదన చెందుతున్నారు. అధిక మొత్తంలో వడ్డీలకు అప్పులుచేసి, పెట్టుబడులు పెట్టి పండించిన పంట వర్షం పాలైతే అప్పుల ఊబిలో కూరుకుపోతామని తల్లడిల్లుతున్నారు. ఇటీవల ఫెలాన్ తుఫాన్ ప్రభావంతో పెద్దనష్టం జరగకుండానే బయట పడ్డామని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో తాజా హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వారం రోజులు వర్షాలు ఆగితే, పండిన పంటను చక్కబెట్టుకునే వీలుంటుందని అంటున్నారు.

అన్నదాతలపై దమనకాండ అన్యాయం

● ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : రైతులపై హర్యానా ప్రభుత్వం దమనకాండ అన్యాయమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు అన్నారు. సోమవారం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేస్తామని, రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకువస్తామని,2022 విద్యుత్ సవరణ చట్టం రద్దు చేస్తామని మూడేళ్ల క్రితం రాత పూర్వకంగా ఇచ్చిన హామీఅమలులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతు సంఘాలు తాజాగా చేపట్టిన చలో ఢిల్లీ పాదయాత్రలో భాగంగా ఢిల్లీ వెళుతున్న రైతన్నలపై పంజాబ్, హరియాణా రాష్ట్రాల సరిహద్దు శంభులో శనివారం రాత్రి కేంద్రం కనుసన్నల్లో హరియాణాలోని బిజెపి కర్కశ రైతాంగంపై టియర్ గ్యాస్, నీటి ఫిరంగులు ప్రయోగించి విచక్షణారహితంగా దాడి చేయడం హేయమన్నారు. ఈ ఘటనలో 17 మంది రైతులు తీవ్రంగా గాయపడగా, అనేక మంది రైతులు అస్వస్థతకు గురయ్యారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులకు కేంద్ర బిజేపి ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు రుణాలు మాఫీ చేయాలి, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం చేయాలని, రైతులకు, రైతు కూలీలకు పింఛను పథకం తీసుకురావాలని, ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాచెల్లించాలని, రైతుల పై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని, ఉత్తరప్రదేశ్ లఖింపూరీ ఘటనలో రైతుల ర్యాలీపై కార్లుతో తొక్కించిన కేంద్రమంత్రి కొడుకుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు నాయకులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు.

కూలిలో కోతపై వాహన బేరర్ల ఆవేదన




ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాహనబోగీలు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక వెంకన్న ఆలయంలో స్వామి వాహన సేవలో పాల్గొనే బేరర్లు కు ఇచ్చే కూలీ ధరలో ధనుర్మాస ఉత్సవాల్లో కోత విధించడంతో వారు ఆవేదన చెందుతున్నారు. వెంకన్న ఆలయాన్ని టిటిడి స్వాధీనపర్చుకుని తొమ్మిదేళ్లు పూర్తయింది. ఏడాది పొడవునా ఈ క్షేత్రంలో అనేక తిరువీధి సేవలు జరుగుతుంటాయి. స్వామి వార్షిక కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ధనుర్మాసోత్సవాలు, శ్రావణ మాసం ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఉత్సవాలు సందర్భంగా అనేక తిరువీధి సేవలు జరుగుతుంటాయి. మాఢవీధుల్లో స్వామి వాహనా లను స్థానికంగా వున్న వాహన బేరర్లే పురాతనం నుంచి మోస్తుంటారు. స్థానికంగా వాహన బేరర్లను బోగీలని పిలుస్తుంటారు.

స్వామి పట్ల వున్న భక్తి భావంతో తాము చేస్తున్న వృత్తిని,కూలి పనులను సైతం వదులుకుని, వాహన బేరర్లు తిరువీధి సేవల్లో వాహనాలను మోస్తుంటారు. ఇలా చాలా కుటుంబాల వారు ఒక్క రూపాయి నుంచి వాహనాలను మోసేవారు. దరిమిలా ఎండోమెంట్స్ హయాంలో దశాబ్దాల కాలం నుంచి వీరికిచ్చే నామమాత్రపు కూలి కూడా పెరుగుతూ వచ్చేది. టిటిడి ఈ ఆలయాన్ని స్వాధీనపర్చుకున్న తరువాత కూడా వీరికి ఇచ్చే కూలిలో పెద్దగా మార్పు కన్పించలేదు. అయినా తరతరాల నుంచి వస్తోందన్న ఉద్దేశంతో వీరంతా వాహనాలను మోస్తూ వస్తున్నారు.ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ250లు చొప్పున కూలి ఇచ్చేవారు. ఈ ఏడాది అక్టోబరులో జరిగిన బ్రహ్మోత్సవాల్లో కూడా రూ. 250లే టీటీడీ చెల్లించింది.

సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కూలి ధర పెంచుతారని వాహన బేరర్లు భావించారు. కానీ వీరికిచ్చే రూ 250లు కూలిలో రూ. 50 తగ్గిస్తూ రూ. 200 చొప్పునే ఇవ్వాలని టిటిడి ఉత్తర్వులు జారీ చేసింది.ఇది చూసిన వాహన బేరర్లు తీవ్ర నిరాశ చెందారు. పెంచాల్సింది పోయి తగ్గించడమేమిటని ప్రశ్నిస్తున్నారు.ఈ విషయాన్ని ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. వెంటనే ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను హోంమంత్రి అనిత దష్టికి తీసుకెళ్లి టిటిడి జెఇఒతో మాట్లాడించి న్యాయం చేసేలా కృషి చేస్తామని, బుజ్జి హామీ ఇచ్చారు. దీంతో వాహన బేరర్లు యథావిధిగా ధనుర్మాస సేవల్లో పాల్గొన్నారు.

వాటర్ టిన్ల బహూకరణ



వాటర్ టిన్‌లు అందజేస్తున్న దాత అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన బోట్లు తయారీ టీం సభ్యులు పిక్కి అప్పలరాజు సోమవారం 5 వాటర్ టిన్‌లను బహూకరించారు. పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ కోడా కాశీరావు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి మేరకు అప్పలరాజు స్పందించి సోమవారం స్కూల్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్ మైలపల్లి మహేష్‌బాబు, పిక్కి రాజు, కారే భూలోక పాల్గొన్నారు.

17,18 తేదీల్లో ఏకసభ్య కమిషన్ పర్యటన

ప్రజాశక్తి -పాడేరు : షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై నియమించిన విశ్రాంత ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఈనెల 17, 18 తేదీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సోమవారం వెల్లడించారు. జిల్లా అధికార యంత్రాంగం, వివిధ ఉపకులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వినతి పత్రాలు పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారని స్పష్టం చేశారు.ఈనెల 18వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాలు స్వీకరిస్తారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



ఉపమాకలో తహాశీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలో ఉపమాక ఆగ్రహారంలో సర్వే నెంబరు 112లోని 27.01 ఎకరాలను 22ఏ లో నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్లు జరగన స్థల నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయా భూములను వెంటనే 22 ఏ నుండి తొలగించాలని తహసిల్దార్ నరసింహమూర్తికి సర్పంచ్ ప్రగడ వీరబాబు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, శ్రీను,నాగేశ్వరరావు, తోలేటి శ్రీనివాస్, వాసు తదితరులు విన్నవించి, వినతిపత్రం అందజేశారు. సోమవారం ఉపమాకలో రెవెన్యూ సదస్సులో 22 ఏ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. 2018 నుంచి ఆయా భూములు 22 ఎ(1) (సి) క్రింద రిలీజియన్ ఆఫ్ ఛారిటబుల్ ఇనిస్టిట్యూషన్ కింద ఎండోమెంట్ భూములుగా నమోదు కావడంతో రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేదింపమని ఎపి దేవాదాయ ధర్మదాయశాఖ నక్కపల్లి సబ్ రిజిష్టర్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా తెలియజేయడంతో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసారని విన్నవించారు. దీంతో అప్పటి నుండి ఈ స్థలానికి సంబందించి ఎటువంటి లావాదేవీలు జరకుండా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కు స్థలం కేటాయించాలని సర్పంచ్ ప్రగడ వీరబాబు వినతిపత్రం అందజేశారు. పలువురు పాస్ పుస్తకాలు, ఆన్లైన్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ ఐ కన్నబాబు, సర్వేయర్ సత్తిబాబు, విఆర్ఓ కామరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : సమగ్ర భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి మండలం, తుమ్మపాల మేజర్ పంచాయతీలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. భూ కబ్జాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్ట పెంటయ్య నాయుడు. ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో సచివాలయం-1లో సోమవారం సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కారం కోరుతూ పలువురు తహాసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి, 45 రోజుల్లో పరిష్కార మార్గం చూపుతామని తహాసీల్దార్ తెలిపారు.

సబ్బవరం : మండలంలోని జివిఎంసి 88వ వార్డు నంగినారపాడు రెవెన్యూ గ్రామాలలో సోమవారం జరిగిన రెవిన్యూ సదస్సులో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ పాల్గొని అర్జీలు స్వీకరించారు. 23 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి ఇందల వెంకట రమణ, రీ సర్వే డిటి ఎం.గణపతిరావు, ఆర్ఐ వీరయ్య, రిజిస్ట్రేషన్ సిబ్బంది జయలక్ష్మి, వెలుగు సర్వేయర్ రాంబాబు, గ్రామ విఆర్ఓ వి.వినోద్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 12, 13 వార్డులకు సంబంధించి ఆరిలోవ టిఐసి పాయింట్ సమీపంలోని హిందీ కాలేజీ రోడ్డులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. చినగదిలి తహశీల్దారు పాల్ కిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో పాటు వార్డు కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి రామన్, కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందరర్భంగా రెవెన్యూ సిబ్బంది 602 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సంగీత్ మాథూర్, జెడ్సీ ఫణి కుమార్, రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, పొత్రకండ ధర్మారావు, ఏడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, మజ్జి రమణి, యల్లమిల్లి సురేష్, జనసేన నాయకులు సీరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ మనుగడ ప్రశ్నార్థకమేనా?



రావికమతంలో సాగులో ఉన్న చెరకు పైరు

- నానాటికీ తగ్గిపోతున్న చెరకు సాగు విస్తీర్ణం
- గిట్టుబాటు కాక సాగుపై రైతుల అనాసక్తి
- ప్రోత్సాహక చర్యల్లో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లిప్తత

ప్రజాశక్తి - రావికమతం : ప్రభుత్వాలు, యాజమాన్యాలు నిర్వాకంతో రాష్ట్రంలో సహకార రంగంలోనే అగ్రగామిగా ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని నేడు అట్టడుగు స్థాయికి చేర్చేస్తున్నారని చెరకు రైతులు ఆవేదన చెందుతున్నారు. అన్నం పెట్టే గోవాడ చెరకు ఫ్యాక్టరీకి కన్నం పెట్టడం వలన రైతాంగం అంతా దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. రైతు కుటుంబాలకు భరోసాగా ఉండే ఈఫ్యాక్టరీ ఇపుడు దివాలాస్థితికి చేర్చేస్తున్నారని రైతులు దిగాలు చెందుతున్నారు. గత ఏడాది ఫ్యాక్టరీ వేసిన చెరకు వేసిన రైతులకు నేటికీ బిల్లులు ఇవ్వకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడం, తదితర కారణాలతోపాటు చెరకు రైతులకు సరైన ప్రోత్సాహమిచ్చే చర్యలు లేకపోవడంతో చెరకు సాగుపై రైతుల అనాసక్తి చూపడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. గతంలో షేర్‌హోల్డర్‌కు,షేరుకు మంచి ఆదరణ, విలువ రేటు ఉండగా, ఇపుడు షేరు విలువతోపాటు రేటు కూడా పడిపోవడంతో ఈ ఫ్యాక్టరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తమౌతోంది.

గత ఏడాది గోవాడ చెరుకు ఫ్యాక్టరీ 1,71,640 టన్నులు చెరకు క్రషింగ్ చేయగా, ఈ ఏడాది లక్ష 30 వేల టన్నులు చెరుకు క్రసింగ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోవాడ సుగర్స్ సిడిఒ రామన్ తెలిపారు.. ప్రస్తుతం 10,109 ఎకరాలలో రైతులు చెరకు సాగు చేస్తుండగా, రాజాం, వెంకుపాలెం, టి అర్జాపురం తదితర గ్రామాలలో అధికంగా సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30లోగా చెరకు కాటాలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని, రానున్నమూడు నెలల్లో చెరకు రికవరీ బాగుంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గోవాడ సుగర్స్ పరిధిలో 20 చెరకు తూనిక కేంద్రాలున్నాయి. ఫ్యాక్టరీలో పలు విభాగాలలో ఉద్యోగ ఖాళీల్నుప్పటికీ ఎటువంటి నియామకాలు లేవు. గతేడాది చెరకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు రూ.350 చొప్పున నేటికీ బకాయి చెల్లించాల్సి ఉన్నా ఇవ్వడం లేదు. ఈ ఏడాది చెరకు టన్నుకు రూ.3,150 ధర నిర్ణయించారు..2022 -23 నుంచి ఇప్పటివరకు చనిపోయిన షేర్ హోల్డర్లకు రూ.30వేలు చొప్పున ఆగస్టు 31 వరకు 366 మందికి రూ.1.09కోట్లు చెల్లించారు.అయితే రైతు సంక్షేమనిధికి కేవలం రూ.80లక్షలు మాత్రమే వసూలైంది. ఈఏడాది మరో 250మంది సభ్యరైతులు మరణించగా, వారికి బీమా పరిహారం చెల్లింపునకు దరఖాస్తులు అందడంతో, సంక్షేమనిధిలో మునుపటి చెల్లింపులకే నిధులు లేని పరిస్థితుల్లో, తాజా క్లెయిమ్‌లకు చెల్లింపులు ఎపుడు చేస్తారో ప్రశ్నార్థకంగానే ఉంది.



దీనావస్థలో ఉన్న చెరుకు కాటా షెడ్

రావికమతం మండలంలో మూడు చెరకు తూనిక కేంద్రాలుండగా, చినపాచీల కాటాకు గతేడాది 1800 టన్నుల చెరుకు సరఫరాకాగా, ఈ ఏడాది 1500 టన్నులు రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. తట్టబంద కాటాలో గతేడాది 300 టన్నులు చెరుకు రాగా, ఈ ఏడాది 800 టన్నులు రావొచ్చని భావిస్తున్నారు ఇక రావికమతం కాటాలో గతేడాది తొమ్మిది వేల టన్నులు చెరకు చేరగా, ఈ ఏడాది ఆరు వేల టన్నులు చేరడం కష్టమేనని భావిస్తున్నారు. సాగువిస్తీర్ణం గణనీయంగా తగ్గడం వల్లే ఫ్యాక్టరీ చెరకు సరఫరా తగ్గుతోందని భావిస్తున్నారు.

చెరకు సాగు గిట్టుబాటు కాని పరిస్థితి ఒకవైపు ఉండగా, మరోవైపు ఫ్యాక్టరీ నుంచి ప్రోత్సాహకం లేకపోవడం, సరఫరా చేసిన చెరకుకు నెలల తరబడి చెల్లింపుల్లో జాప్యం, ఇతర సహకారం కొరవడడంతో వంటి కారణాలతో రైతులు చెరకు స్థానే యూకలిప్టస్, సరుగుడు ,మామిడి, జీడి, వరి తదితర పంటల సాగువైపు మళ్లిపోతున్నారు. చెరకు రైతుల మహాజనసభలో నేతలిచ్చిన హామీలు ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంతో రైతులు పెదవివిరుస్తున్నారు. ఫ్యాక్టరీ సజావుగా నడిపేందుకు అవసరమైన ప్రోత్సాహక చర్యలు చేపట్టకుండా, కావాలనే నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఫ్యాక్టరీని ఆధునికీకరించి, అగ్రగామిగా నిలుపుతామన్న హామీలను నిలబెట్టుకోకుంటే, ప్రస్తుతం నెలకొని కొనసాగుతున్న పరిస్థితుల్లో ఇతర ఫ్యాక్టరీల మాదిరిగానే గోవాడ సుగర్స్ కూడా చరిత్రలో మిగిలిపోనుందని చెరుకు రైతులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

21న మెగా రక్తదాన శిబిరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మెగా రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13సంవత్సరాలుగా పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు ఏకా శివ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, నాయకులు తమరాన శ్రీను పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు మౌనిక



మౌనిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల బాక్సింగ్ పోటీలకు 80 కేజీల విభాగంలో బొంతు మౌనిక ఎంపికైందని స్థానిక నింజా అకాడమీ కోచ్ అబ్బు తెలిపారు. పంజాబ్, భటిండాలోని గురుకాశీ యూనివర్సిటీలో ఈనెల 18 నుంచి 24 వరకు జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయి.

గత నెలలో విశాఖపట్నం, ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 80కిలోల కేటగిరిలో పాల్గొన్న మౌనిక స్వర్ణ పతకంతో సత్తాచాటి నేషనల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారన్నారు. మౌనికను స్థానిక డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు, నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రీకాంత్, శ్రావణ్, వెలగా జగన్నాథ్, పారుపల్లి శ్రీనివాస్ తదితరులు అభినందించి, జాతీయ పోటీల్లో సత్తాచాటి బంగారు పతకాన్ని సాధించాలని, తద్వారా ఇంటర్నేషనల్ పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. మౌనికను అభినందించిన వారిలో కోచ్ సన్యాసిరావు, శేఖర్, తోటి క్రీడాకారులు ఉన్నారు.

రామానుజన్ గణిత ప్రతిభా పరీక్షలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు హారిక, సత్యరోచన్

ప్రజాశక్తి -నక్కపల్లి : జిల్లా స్థాయి రామానుజన్ గణిత ప్రతిభా పరీక్షల్లో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థకు చెందిన ఇరువురు విద్యార్థులు మొదటి ర్యాంక్ సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న గణిత ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు ప్రతి ఏడాది రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, రామచంద్రాపురం ఆధ్వర్యంలో రామానుజన్ గణిత ప్రతిభా పరీక్ష రెండు స్థాయిలలో నిర్వహించినట్లు తెలిపారు. గతనెల 17న నిర్వహించిన 35వ రామానుజన్ జాతీయ గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించగా, శ్రీ ప్రకాష్ విద్యార్థులు తుమ్మలపల్లి హారిక (3వ తరగతి), లెక్కల సత్య రోచన్ (4వ తరగతి) జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారని సిహెచ్. విజయ్ ప్రకాష్ వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయరూ..?



ప్రయివేటు వ్యాపారి వద్దకు అమ్మకానికి తెచ్చిన ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే వరికోతలు ముమ్మరంగా సాగుతుండడం, ధాన్యం సిద్ధం కావడంతో వాటిని నిల్వ ఉంచే సౌలభ్యం లేకపోవడం, మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోక రైతులు తల్లడిల్లుతున్నారు. ఇదే సమయంలో వర్ష హెచ్చరికలతో రైతులు ఆందోళన పట్టుకుంది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమ ధాన్యాన్ని దళారుల చేతుల్లో పెడుతున్నారు. ఇప్పటికే మండలంలోని ఏఎల్.పురం, కొంగసింగి ప్రాంతాల్లో ప్రైవేటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఆయా కేంద్రాలకు వెళ్లి రైతులు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : ఇటీవల అకాల మరణం చెందిన మండలంలోని జానకయ్యపేట గ్రామానికి చెందిన జనసేన నాయకులు దూళి అప్పలరాజు కుటుంబానికి జనసేన నేతలు, కార్యకర్తలు అండగా నిలిచారు. సోమవారం జనసేన జిల్లా కార్యదర్శి కురుందాసు అప్పలరాజు, తులసీరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు రూ.65,300 ఆర్థిక సహాయాన్ని మృతుని భార్యపిల్లలకు అందజేశారు. మృతుని కుటుంబానికి తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలో వేములపూడి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు విద్యుత్ పొదుపుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈమేరకు విద్యార్థులకు ఇంధన పొదుపు అంశంపై పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని, రాయితీపై లభించే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఎల్ఇడి బల్బుల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని, వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లలో వీలైనంత వరకు విద్యుత్‌ను ఆదా చేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను ఉపయోగించాలన్నారు. సుస్థిర భవిష్యత్ కోసం ఇంధన పొదుపు అత్యావశ్యకమని.. భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు ఇంధనాన్ని ఆదా చేయాల్సి ఉందన్నారు. పోటీల్లో విజేతలకు ఈనెల 20వ తేదీన వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి- మాడుగుల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాలుగు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రాజారామ్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్‌లో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈనెల 20 వరకు ఐదు రోజులపాటు మండల పరిషత్ కార్యాలయంలో 4 ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపిడిఒ కొంకి అప్పారావు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహనా సదస్సు నిర్వహించి,, ఆధార్ అప్‌డేషన్, కొత్తగా నమోదు, మార్పులు చేర్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కరుణాకర్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.